సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 22 । జనవరి । 2023



బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన కోలా నాగ రమేష్, స్నేహ దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు.



28న రథసప్తమి వేడుకలు

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

శ్రీనివాసా.. గోవిందా



జంగారెడ్డిగూడెం : గోకులతిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

న్యూస్‌రీల్

జాన్సన్‌కు అభినందనలు



మంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మేడిది జాన్సన్

పెంటపాడు: రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా భీమవరానికి చెందిన మేడిది జాన్సన్ ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కొట్టు ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయిలో అమలాపురంలో జరిగిన సపక్‌తక్రా మహిళా ఇంటర్ కాలేజీయేట్ అండ్ యూనివర్సిటీ ఎంపిక పోటీల్లో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు తృతీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. పి.అంజలీదేవి, పి.భూమిక మణిపూర్ యూనివర్సిటీలో జరిగే అఖిల భారత స్థాయి ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. అలాగే పెదవేగి గురుకుల పోటీల్లో నిర్వహించిన అండర్–19 రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు విజేతగా నిలిచారని ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు తెలిపారు. ఎ.సింధు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన నెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థిని టి.దేవిరమ్య ద్వితీయ స్థానం సాధించిందన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఇంగ్లిష్ సబ్జెక్టులో మిగిలిన 12 ఖాళీలను పూర్తి చేయడానికి సర్దుబాటు పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియ ముగించామని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి డి.మధుసూదనరావు తెలిపారు. శనివారం ఏలూరు డీఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కౌన్సెలింగ్‌కు మొత్తం 69 మందిని పిలిచామని, జిల్లాలోని కుకునూరు వంటి ప్రాంతాన్ని కూడా ఉపాధ్యాయులు కోరుకోవడంతో కౌన్సెలింగ్ పూర్తిస్థాయిలో నిర్వహించినట్లయిందన్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు పొందిన వారికి వారి స్థానాల్లో ఎప్పుడు చేరేది ప్రభుత్వం నిర్దేశించిన విధంగా త్వరలో తెలియజేస్తామని తెలిపారు. ఏలూరు ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి పాల్గొన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు అందించిన జెడ్పీ చైర్మన్

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యం పరిధిలో వివిధ కార్యాలయాల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామక పత్రాలను శనివారం జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అందించారు. మల్లి నవీన్‌కుమార్‌ను ఏలూరు జిల్లా పరిషత్‌లో, పతివాడ సాయి కిషోర్‌ను కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో, సంగడాల (కంపా) సుధారాణిని జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో, పిల్లా సాయి రాజేష్‌ను ఏలూరు జిల్లా పరిషత్‌లో, సోహాన్ వికాస్‌ను ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

కౌలు రైతుకు భరోసా

ఉమ్మడి జిల్లాలో 99 వేల మందికి కార్డులు

- ఏలూరు జిల్లాలో రూ.46.79 కోట్లు
- పశ్చిమగోదావరిలో రూ.53 కోట్ల రుణాలు అందజేత
- మరిన్ని కార్డులు అందించేందుకు చర్యలు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: కౌలు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వ్యవసాయ ఆధారితమైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కౌలు రైతులకు అన్నింటా భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తోంది. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పథకాలకు దూరమైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి రుణాలు మంజూరు చేయడంతో పాటు రైతు భరోసా పథకంలో ఆర్థిక లబ్ధిని చేకూరుస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈ ఏడాదిలో ఇప్పటివరకూ సుమారు 99 వేల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సుమారు వంద కోట్ల పంట రుణాలను అందించారు. తద్వారా సొంత పొలం ఉన్న రైతులతో సమానంగా కౌలు రైతులకు మేలు జరగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

పక్కాగా పథకాలు

రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తున్న రైతు భరోసా లబ్ధిని కౌలు రైతులకు అందాలని జిల్లా అధికారులు నిర్ణయించి చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా భూ యజమానులకు, కౌలు రైతులకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ భూ యజమానులతో ఇబ్బందులు లేకుండా వారి హామీతో కౌలుకార్డులు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా ఏలూరు జిల్లాలో 42 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 57 వేల కార్డులను కౌలు రైతులకు అందించారు. వీటి ద్వారా ఏలూరు జిల్లాలో రూ.46.79 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.53 కోట్ల పంట రుణాలను అందించి కౌలు రైతులకు సాగు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

గుర్తింపు కార్డులతో ప్రయోజనాలెన్నో..

కౌలు రైతుల గుర్తింపు కార్డుల ద్వారా బ్యాంకు రుణాలు పొందడంతో పాటు పండించిన పంటను నేరుగా ప్రభుత్వానికి విక్రయించే వెసులుబాటు కలుగుతుంది. అలాగే ప్రకృతి విపత్తులు తదితర కారణాలతో పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వ పరిహారం కౌలు రైతులకు అందుతుంది.

పెట్టుబడికి సాయం

పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా కింద రైతులకు ఏటా పెట్టుబడి సాయం అందిస్తున్నారు. అయితే కౌలు రైతులకు సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో మొత్తం సొమ్ము రూ.13,500 రాష్ట్ర ప్రభుత్వమే కౌలు రైతులకు అందిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసి, కౌలు రైతులందరికీ రైతు భరోసా సొమ్ములు అందించాలని ఆదేశించింది.



3.50 లక్షల మందికి పైగా..

ఏలూరు జిల్లాలో 1.50 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు వెనకడుగు వేస్తున్నారు. గతంలో కౌలు రైతులకు రుణాలు మాఫీ చేయకపోవడంతో ప్రస్తుతం సుమారు 38 వేల మంది కౌలు రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకుండా నాన్‌పెయిడ్ జాబితాలోకి చేర్చింది. అలాగే వన్‌టైం సెటిల్‌మెంట్ పేరుతోనూ కౌలురైతులను కొన్ని బ్యాంకులు ఇబ్బంది పెడుతున్నాయి. వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి గత పాలకులు ముఖం చాటేయడంతో తమకు ఈ గతి పట్టిందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం కౌలు రైతులుగా గుర్తింపు పొంది కౌలు కార్డులు పొందిన వారందరికీ తప్పనిసరిగా రుణాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే రాష్ట్ర బ్యాంకర్ల సమావేశంలో సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకర్లకు, కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

రైతులతో సమానంగా..



సొంతభూమి కలిగిన రైతుతో సమానంగా కౌలు రైతులకు ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు ఇప్పటికే బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఏలూరు జిల్లాలో రూ.46.79 కోట్లను కౌలు రైతులకు **పంట రుణాలుగా అందించాం.** మరిన్ని రుణాలు **అందించేందుకు చర్యలు తీసు**కుంటున్నాం.

– వై.రామకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్

స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కౌలు రైతులందరికీ రుణాలు అందించాలి. అలాగే ప్రతి ఒక్క కౌలు రైతును గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి గుర్తింపు కార్డులు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారిస్తూ అర్హులైన వారికి కౌలుకార్డులు అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడం శుభపరిణామం.

– కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

బలహీనవర్గాలకు అండగా సీఎం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి కారుమూరి, చిత్రంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ వీరన్న

తణుకు అర్బన్: రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దేశ చరిత్రలో బీసీ కులాలను గుర్తించి 56 కార్పొరేషన్‌లను ప్రకటించి చైర్మన్‌లు, డైరెక్టర్‌లుగా పదవులు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని వీరన్న అన్నారు. ఇటీవల ముగిసిన కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులను తిరిగి వారికే అందజేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బీసీలంతా ఏకతాటిపై నిలబడి వైఎస్సార్‌సీపీకి తిరిగి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

రహదారి భద్రతకు పటిష్ట చర్యలు

కలెక్టర్ ప్రశాంతి



జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్) : జిల్లాలో రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో నిర్దేశించిన పనులు పూర్తి కాకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్క ప్రాణం కోల్పోయే పరిస్థితి ఉండకూడదన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

జిల్లాలో జరుగుతున్న రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి పనుల దృష్ట్యా ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, అపసవ్య దిశలో వాహనాల ప్రయాణం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం తదితర తప్పిదాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించాలన్నారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్)ను గుర్తించి, జాతీయ రహదారిని కలిపే రోడ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. జాతీయ రహదారిపై ఎక్కడా గోతులు లేకుండా నేషనల్ హైవేస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

త్వరితగతిన రోడ్డు పనులు

లోసరి రోడ్డు పనులు, భీమవరం బైపాస్ రోడ్డు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లోసరి జంక్షన్ వద్ద రోడ్డు వెడల్పు చేసి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జేపీ రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలన్నారు. 216–ఎన్‌హెచ్‌పై సైన్ బోర్డులు, హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. భీమవరంలో పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. దిగమర్రు సెంటర్ టీ జంక్షన్‌లో యుద్ధ ప్రాతిపదికన హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టరేట్ అప్రోచ్ రోడ్డు నుంచి శృంగవృక్షం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, భీమవరం గోదాముల వద్ద రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆమె ఆదేశించారు.

జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఎస్ఈబీ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్.లోకేశ్వరరావు, నేషనల్ హైవే డీఎం ఎం.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ వి.నరసింహమూర్తి, డీఈఓ ఆర్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షలకు 40 కేంద్రాలు

ఎస్పీ రవిప్రకాష్



భీమవరంలో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలకు జిల్లాలో సుమారు 18 వేల మంది హాజరుకానున్నారని, ఈ మేరకు 40 కేంద్రాలు ఏర్పాటుచేశారని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. శనివారం భీమవరం విష్ణు కాలేజీ సమావేశ మందిరంలో పరీక్షల బందోబస్తుకు హాజరయ్యే సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై సూచనలు చేశారు. భీమవరం, తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారని పటిష్ట బందోబస్తు ఉంటుందన్నారు. పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్, కాపీయింగ్ వంటి అక్రమాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విధి నిర్వహణలో ఉన్న ఎస్సైలు పరీక్షల అనంతరం ఆన్సర్ షీట్లను స్టోరేజ్ పాయింట్ వరకు చేర్చే వరకూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, నరసాపురం డీఎస్పీ మనోహరాచారి, ఆర్మడ్ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఎస్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగిరపర్చాలి



ప్రత్తిపాడులో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి మహ్మద్ దివాన్

పెంటపాడు: జగనన్న గృహనిర్మాణ పథకం లక్ష్యాన్ని నూరుశాతం పూర్తిచేసేలా సిబ్బంది కృషిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రత్యేక కార్యదర్శి బి.మహ్మద్ దివాన్ అన్నారు. శనివారం ఆయన తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని జగనన్న కాలనీలను సందర్శించారు. లబ్ధిదారులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. గ్రౌండింగ్ కాని నిర్మాణాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడారు. లేఅవుట్‌లు, ప్లాట్‌లు, సెక్షన్‌లు, వాటర్ పైపులైన్లు, విద్యుత్, రహదారులపై ఆరా తీశారు. ప్రత్తిపాడు లేఅవుట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వచ్చే ఉగాదిలోపు రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు గృహప్రవేశాలు చేసుకోవాలనే లక్ష్యంతో సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రతి లేఅవుట్‌ను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. గృహ నిర్మాణాలు వేగిరపర్చేలా చర్యలు తీసుకోవడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పెదతాడేపల్లి, మెట్ట ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెంలోని సబ్‌స్టేషన్ ప్రాంతం, ప్రత్తిపాడులోని భారీ లే అవుట్లను ఆయన పరిశీలించారు. హౌసింగ్ పీడీ ఎ.రామరాజు, ఈఈ బీవీ రమణ, డీఈ కేవీవీ ప్రసాద్, ఏఈ బి.రాజేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆయన వెంట ఉన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి



చెస్ విజేతలతో జేసీ మురళి, నిర్వాహకులు

సాక్షి, భీమవరం: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు భీమవరం విశ్వకవి స్కూల్‌లో జరిగిన స్టేట్ స్కూల్ చిల్డ్రన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను విద్యతోపాటు క్రీడల్లో కూడా ఉత్సాహంగా పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఇన్‌చార్జ్ డీఆర్వో దాసి రాజు మాట్లాడుతూ చెస్‌తో మేధస్సుకు పదును పెట్టుకోవచ్చన్నారు. అనంతరం విజేతలకు జేసీ మురళి, డీఆర్వో రాజు బహుమతులు అందించారు. విశ్వకవి స్కూల్ డైరెక్టర్ పాట్లూరి రఘుబాబు, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాదాసు కిషోర్, గమిని రవి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–7 విభాగంలో పి.సాయిషరియన్, సీహెచ్‌పీ రితిక అక్షయ, అండర్–9లో వి.జయప్రకాష్, బండి కీర్తన, అండర్–11లో పి.మితిలేష్, వి.త్రిపురాంబిక, అండర్–13లో ఎస్ఎస్ కార్తీక కన్నా, కొల్లా భావన్, అండర్–15లో బీఎన్ అఖిల్‌చరణ్, డీఎస్ఎస్ శ్రీలక్ష్మి, అండర్–17లో డీఎస్ఎస్‌యూ సాత్విక్, వై.నిశ్చల విజేతలుగా నిలిచారు.

ఈ-కేవైసీ పూర్తి చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): భూహక్కు పత్రాలకు సంబంధించి నూరు శాతం ఈ కేవైసీ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. స్థలానికి పట్టాలు తీసుకుని ఇంటి నిర్మాణానికి నిరాకరిస్తున్న పట్టాదారుల వివరాలు లేఅవుట్ వారీగా సేకరించాలని, కారణాలు తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలన్నారు. ఎంపీఎఫ్‌సీ, ఏఎంసీయూల నిర్మాణాలకు సేకరించిన భూములను వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. నవరత్నాల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. శ్మశాన వాటికలకు భూములను గుర్తించాలన్నారు. సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్డీఓ దాసి రాజు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో పశ్చిమ శుభారంభం

ఆత్మకూరు: రాష్ట్రస్థాయి అండర్-14, 17 నెట్‌బాల్ టోర్నీ ఆత్మకూరులో శనివారం ప్రారంభం కాగా, పశ్చిమ జట్టు శుభారంభం చేసింది. తొలిరోజు అండర్-14 బాలుర విభాగంలో వెస్ట్ గోదావరి కృష్ణాపై 11-0, అనంతపురం వెస్ట్ గోదావరిపై 6-3 గోల్స్ తేడాతో విజయం సాధించాయి. అండర్ 17 బాలికల విభాగంలో వెస్ట్ గోదావరి జిల్లా జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 5-1 తేడాతో గెలుపొందింది.

పెండింగ్ కేసులను సత్వర విచారణ చేయాలి

- రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్
- ఏలూరులో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులతో సమావేశం



ఏలూరు జిల్లా కోర్టులో సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, సమావేశానికి హాజరైన జడ్జిలు

ఏలూరు (టూటౌన్): కోర్టుల్లోని పెండింగ్ కేసులను సత్వర విచారణ చేయడం ద్వారా వాటి పరిష్కారానికి న్యాయమూర్తులు కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించే విధంగా న్యాయమూర్తులు పనిచేయాలన్నారు. తద్వారా న్యాయవ్యవస్థపై ప్రజలకు ఒక విధమైన నమ్మకం, గౌరవం ఏర్పడుతుందన్నారు. కోర్టులలో పెండింగ్ కేసులు విచారణ, తీర్పులు త్వరితగతిన చేయటానికి ఉన్న అవకాశాలపై సమావేశంలో ఆయన న్యాయమూర్తులతో చర్చించారు. సాధారణ పరిపాలనా పరమైన పర్యవేక్షణలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో భాగంగా ఆయన న్యాయమూర్తులకు తగు సూచనలు, సలహాలు అందించారు. సమావేశానికి ముందుగా ఆయన కోర్టు ఆవరణను పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు పీపీలు, ఏపీపీలు జడ్జిని కలిసి జిల్లా కోర్టు ప్రాంగణంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ జిల్లా కోర్టు ఆవరణలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు ఘన స్వాగతం

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌కు జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించే జిల్లా న్యాయాధికారుల సమావేశంలో పాల్గొనేందుకు ఆయన శనివారం ఏలూరు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్‌లో కొంతసేపు బస చేశారు. ఆయనను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ్ కుమార్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ వారితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏలూరు ఆర్డీఓ పి.పెంచల కిషోర్, తహసీల్దార్ సోమశేఖర్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు బీవీ కృష్ణారెడ్డి, పలువురు న్యాయమూర్తులు హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యలపై న్యాయ ఉద్యోగుల వినతి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తుల సమావేశానికి విచ్చేసిన హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌కు ఏపీ న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ నాయకులు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిరెడ్డి రాము ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం నాయకులు హైకోర్టు జడ్జిని కలిశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు. హైకోర్టు జడ్జిని కలిసిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి సత్యనారాయణ, సహాధ్యక్షురాలు ఎస్.గీత, ఉపాధ్యక్షుడు వి.నరసింహమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి వి.రాఘవేంద్రరావు, సహాయ కార్యదర్శి అన్నే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా జడ్జి పురుషోత్తం, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

ముగిసిన జీడిమామిడి సాగుపై జాతీయ సదస్సు


జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో వర్సిటీ వీసీ జానికి రామ్ తదితరులు

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన పరిశోధన స్థానంలో జీడిమామిడి సాగుపై గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఏఐసీఆర్‌పీ వార్షిక సమావేశం శనివారం ముగిసింది. దేశవ్యాప్తంగా వివిధ పరిశోధన స్థానాలలో జరుగుతున్న పరిశోధనల మూల్యాంకనం కొరకు ఉద్యాన వర్సిటీతో పాటు జీడిమామిడి పరిశోధన డైరెక్టరేట్ పుత్తూరు సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించారు. ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.బి.పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, వర్సిటీ ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ అధ్యక్షత వహించారు. పుత్తూరు జీడిమామిడి పరిశోధన డైరెక్టరేట్ సంచాలకులు డాక్టర్ జే.దినకర్, డాక్టర్ ఎల్.నారాం నాయుడు, డాక్టర్ కరుణశ్రీ పాల్గొన్నారు. జీడిమామిడి రైతులు, శాస్త్రవేత్తలు హాజరై చర్చా కార్యక్రమం నిర్వహించారు. రైతులు అడిగిన పలు సందేహాలకు శాస్త్రవేత్తలు వివరణ ఇచ్చారు. వీసీ టి.జానకిరామ్ మాట్లాడుతూ నూతనంగా శ్రీకాకుళం జిల్లా పెద్దపేటలో ఏర్పాటు చేసిన జీడీ, కొబ్బరి పరిశోధన స్థానానికి జన్యు బ్యాంకు మంజూరు చేయాలని కోరారు. డాక్టర్ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ జీఎస్ మోహన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యలమంచిలి: చించినాడ హైవేలో కలగంపూడి వద్ద శనివారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం మాట్ల గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకటరెడ్డి (20) తూర్పు గోదావరి జిల్లా బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా కలగంపూడి వద్ద ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు రోడ్డు నుంచి స్కూల్ లోపలకు అకస్మాత్తుగా రోడ్డు క్రాస్ చేయడంతో వెంకటరెడ్డి నేరుగా బస్సును ఢీ కొట్టాడు. దీంతో అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తండ్రి గోవిందరాజులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు.

● ఇంటింటికీ సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్: కడియద్ద గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


తణుకు అర్బన్: తణుకు 8వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ముఖేష్‌కు ఉత్తమ యువ ఆక్వా రైతు అవార్డు


కాకినాడ ఎంపీ వంగా గీత చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ముఖేష్

కాళ్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉత్తమ యువ ఆక్వా రైతు అవార్డును 2022వ సంవత్సరానికి పెదఅమిరం గ్రామానికి చెందిన రైతు, వైఎస్సార్ సీపీ నాయకులు సరాబు ముఖేష్ సాధించాడని ఆక్వా ఎక్స్‌పో చీఫ్ ఆర్గనైజర్ కోనా జోసెఫ్ తెలిపారు. శనివారం కాకినాడలో జరిగిన 22వ ఆక్వా టెక్ ఎక్స్‌పోలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీత చేతుల మీదుగా ఈ అవార్డును ముఖేష్‌కు ప్రదానం చేశారన్నారు. చిన్న వయసులోనే ఆక్వా సాగులో మెలకువలు తెలుసుకుని అధిక దిగుబడులు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని స్పష్టం చేశారు. పలువురు రైతులు ముఖేష్ కు అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం అర్బన్: చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంకు చెందిన సైదు జ్ఞానరాజు (44) ఉద్యోగం నిమిత్తం కువైట్ వెళ్లి అక్కడ కొంతకాలం ఉండి పట్టణానికి తిరిగొచ్చి ఏడేళ్లుగా ఇక్కడే ఉంటున్నాడు. ఇటీవల అప్పులు ఎక్కువై తీర్చలేక సతమతం అవుతున్నాడు. ఇంటిలో గొడవలకు దారితీయడంతో మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై జీజే ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వాలీబాల్ జాతీయ పోటీల రిఫరీగా అమరేందర్ బాబు

కైకలూరు: వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (వీఎఫ్ఐ) ఆధ్వర్యంలో అసోం రాష్ట్రంలో త్వరలో జరిగే జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు రిఫరీగా కైకలూరు మండలం పల్లెవాడ గ్రామానికి చెందిన బీసాబత్తిన అమరేందర్ బాబు ఎంపికయ్యారు. ఈ మేరకు వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ అనిల్ చౌదరి నుంచి ఆహ్వాన లేఖ శనివారం అందింది. ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు పురుషులు, స్త్రీల 71వ సీనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు అసోం సరుసజై స్పోర్ట్స్ కాంప్లెక్స్ నబిన్ చంద్ర బార్డోలోయ్ ఇండోర్ స్టేడియంలో జరగనున్నాయి. సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు అమరేందర్ బాబు స్పోర్ట్స్ కోటాలో దక్షిణ మధ్య రైల్వేలో సీనియర్ టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రైల్వే జట్టుకు సేవలు అందించారు. జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా అవకాశం రావడంతో ఆయనను పలువురు అభినందించారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

- దర్బరేవులో విక్రయిస్తుండగా మైనర్ సహా ముగ్గురి అరెస్టు
- ఎస్పీ యు.రవిప్రకాష్ వెల్లడి

నరసాపురం: నరసాపురం తీరంలో శనివారం గంజాయి అమ్మకాల వ్యవహారం వెలుగుచూడటం కలకలం సృష్టించింది. అరకు చుట్టుపక్కల గిరిజన ప్రాంతాల నుంచి నరసాపురం మండలం దర్బరేవు గ్రామంలో విక్రయాలు చేసేందుకు సిద్ధమవుతున్న మైనర్ సహా ముగ్గురిని పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నరసాపురం రూరల్ సీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ యు.రవిప్రకాష్ కేసు వివరాలు వెల్లడించారు. నరసాపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యార్థులు, కూలి పనులు చేసుకునేవారు టార్గెట్‌గా కొందరు గంజాయి విక్రయాలు చేస్తున్నట్టుగా వచ్చిన సమాచారంతో ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టినట్టు ఎస్పీ వివరించారు. నరసాపురం పట్టణం కొండాలమ్మగుడి ప్రాంతానికి చెందిన శ్రీధర్, దర్బరేవు గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్ అనే యువకులు, మరో మైనర్ మోటార్‌సైకిళ్లపై గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించి దాడి చేసి దర్బరేవు గ్రామంలో శనివారం అరెస్ట్ చేశామని చెప్పారు. వారి నుంచి రూ.2.10 లక్షల విలువ చేసే 22 కిలోల గంజాయి, రెండు మోటారుసైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.1750 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఎస్పీ చెప్పారు.

పోలీసుల వద్ద 200 మంది గంజాయి తాగేవారి వివరాలు

జిల్లాలో గంజాయికి అలవాటు పడి సేవిస్తున్నవారిపై కొంతకాలంగా పోలీసుశాఖ నిఘా పెట్టిందని ఎస్పీ రవిప్రకాష్ చెప్పారు. పోలీసుల వద్ద జిల్లాలో గంజాయి సేవిస్తున్న 200 మంది వివరాలు ఉన్నాయన్నారు. అలాగే అరకు, ఇతర గిరిజన ప్రాంతాల నుంచి గంజాయి ఇక్కడికి తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నట్టుగా దాదాపు 30 మందిని అనుమానిస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా వారంతా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు విడనాడాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి వాసన లేకుండా పూర్తిగా నిర్మూలించడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గంజాయికి అలవాటుపడ్డ వారు స్వచ్ఛందంగా పోలీసులను సంప్రదిస్తే, కౌన్సెలింగ్ ఇవ్వడం, రిహాబిలిటేషన్ సెంటర్‌కు తీసుకెళ్లడం జరుగుతుందని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే గంజాయికి అలవాటుపడ్డ యువకుల తల్లిదండ్రులను రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ కె.రవిమనోహరాచారి, సీఐలు శ్రీనివాసయాదవ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

రూ.5.50 లక్షల విలువైన ఎరువులు సీజ్


కలిదిండి గోడౌన్‌లో ఎరువులను సీజ్ చేసిన వ్యవసాయాధికారులు

కైకలూరు (కలిదిండి): కలిదిండిలోని ఓ దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ చేసిన 5 టన్నుల వివిధ రకాల ఎరువులను వ్యవసాయాధికారులు శనివారం సీజ్ చేశారు. కైకలూరు ఏడీఏ ఆర్.గంగాధరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో మండలంలో ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో కలిదిండిలోని వినాయక ఆక్వా ఏజెన్సీ గోడౌన్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా యూరియా, సూపర్, పొటాష్, 28-28 కాంప్లెక్సు ఎరువులు, జింక్ సంబంధిత ఎరువులు నిల్వ చేసినట్లు తనిఖీల్లో తేలగా, వీటిని సీజ్ చేశామన్నారు. వీటి విలువ రూ.5.50 లక్షలు ఉంటుందన్నారు. దుకాణ యజమాని పోతన వంశీపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి జేసీకి నివేదిక పంపించామన్నారు. ఎరువుల విక్రయ దుకాణదారులందరూ తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. విధిగా లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. తనిఖీల్లో కలిదిండి ఏఓ సాగర్, వీఆర్వో గుడిపాటి శేష శ్రీనివాస్, ఎరువుల డీలర్ నీలి వెంకటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.వెంకన్న, బి.ఫణికుమార్, జి.సాయికుమార్ తనిఖీల్లో పాల్గొన్నారు.

30 నుంచి నిడదవోలు రైల్వే గేటు మూత

నిడదవోలు: నిడదవోలులోని నెహ్రూబొమ్మ సెంటర్‌లోని రైల్వే ట్రాక్‌కు మరమ్మతుల చేపట్టనుంటంతో ప్రధాన రైల్వే గేటును ఈనెల 30 నుంచి పది రోజుల పాటు మూసివేయనున్నట్లు తాడేపల్లిగూడెం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ అల్లూరి రవి చెప్పారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్టీసీ ఉన్నతాధికారులకు శనివారం రైల్వేశాఖ ఉన్నతాధికారులు దీనిపై నోటీసులు అందజేశారు. రైల్వేశాఖ భద్రతా చర్యల్లో భాగంగా రెండేళ్లకు ఒకసారి రైల్వేగేటు లోపల ఉన్న రెండు ట్రాక్‌ల వద్ద మరమ్మతు పనులు చేపడుతున్నారు. రోజూ 200 రైళ్లకు పైగా ఈమార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. మరమ్మతులు పూర్తయిన తరువాత ఫిబ్రవరి 8వ తేదీ నుంచి తిరిగి రైల్వేగేటు తెరవనున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు

రైల్వేగేటు మూసివేసినా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తాడేపల్లిగూడెం నుంచి బస్సు సర్వీసులు రాజమహేంద్రవరం, కొవ్వూరు, పంగిడి ప్రాంతాలకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో గేటు వద్ద ప్రయాణికులను దింపేస్తారు. అక్కడ నుంచి రైల్వేట్రాక్ దాటుకుని ప్రయాణికులు బయటకు వచ్చి రాజమహేంద్రవరం వెళ్లేందుకు నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి ఐదు బస్‌లను నడపనున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, పంగిడి, దేవరపల్లి నుంచి ద్విచక్ర వాహనాలు మాత్రమే తాడేపల్లిగూడెం వెళ్లడానికి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చేరుకోవచ్చు. ముందుగా నిడదవోలులోని గణేష్ చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్, సంతమార్కెట్, సుబ్బరాజుపేట మీదుగా సింగవరం, తాళ్లపాలెం గ్రామాల మీదుగా తాడేపల్లిగూడెం చేరుకోవచ్చు. తాడేపల్లిగూడెం నుంచి తాళ్లపాలెం, సింగవరం గ్రామాల మీదుగా నిడదవోలు చేరుకుని రాజమహేంద్రవరం వెళ్ళవచ్చు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కడియద్ద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం


కడియద్ద గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఏ ప్రభుత్వం ఇవ్వని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతున్నాయంటే ఒక్క సచివాలయ, వలంటరీ వ్యవస్థే కారణమన్నారు. ఇటువంటి వ్యవస్థకు రాజకీయ రంగు పులిమితే ఉపేక్షించేది లేదన్నారు. నేడు గ్రామం దాటకుండానే సచివాలయాల్లో పనులు జరిగిపోతున్నాయని, దీనికంతటికి సీఎం జగన్ కారణమన్నారు. ఆయన మదిలో మెదిలిన ఆలోచనే సచివాలయ, వలంటరీ వ్యవస్థ అని పేర్కొన్నారు. అటువంటి వ్యవస్థను రద్దు చేయాలని చంద్రబాబు డిమాండ్ చేస్తున్నారన్నారు. పేదలకు న్యాయం జరగడం చంద్రబాబు తట్టుకోలేకపోతున్నాడని విమర్శించారు. దుర్మార్గపు ఆలోచనతో ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు సంతోషంగా ఉంటే తన రాజకీయ మనుగడ ఉండదని చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. పవన్‌ను అడ్డం పెట్టుకుని కాపు సామాజికవర్గం ఓట్లను దోచుకోవాలని చూస్తున్నారన్నారు. ప్రధానంగా గ్రామంలోని డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ప్రతి ఇంటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి.శేషులత, సర్పంచ్ యాతం కోటీశ్వరి, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, మేణ్ణి రామారావు, సొసైటీ చైర్మన్‌లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, చిక్కాల సత్యనారాయణ, జడ్డు హరిబాబు, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు టి.శేషుబాబు, టి.పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్టు విశాల్, ముప్పిడి సంపత్ కుమార్, సంపతరావు కృష్ణారావు, దారపురెడ్డి శ్రీనివాస్, యాతం బూరయ్య, బొడ్డాని శ్రీనివాస్, పరిమి వెంకటేశ్వరరావు (భూపయ్య), పాకనాటి తాతాజీ, కొల్లా విజయలక్ష్మికుమారి, పోలిమోను శ్రీనివాస్, కొండుబోయిన కృపావరం, రెడ్డి సూరిబాబు, మట్టా సత్యనారాయణ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీవరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


అత్తిలి మండలం ఈడూరులో విశేష అలంకరణలో శ్రీవరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాత సేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేసారు. పరిసర ప్రాంతాలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుని, ఏడువారాల నోము నోచుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాత సహకారంతో అన్నదానం చేసారు. రాత్రి స్వామివారికి ఊంజల్ సేవ జరిపారు.

క్లుప్తంగా

మంత్రి కారుమూరిని కలిసిన మేడిది జాన్సన్


మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేడిది జాన్సన్

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందచేశారు. ఆయన వెంట ఏపీ స్టేట్ పాస్టర్ ఫెలోషిప్ స్టేట్ జాయింట్ సెక్రటరీ జొహన్నాస్ ప్రేమ్‌కుమార్ మల్లిపూడి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి


తణుకులో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తణుకు: ఆటోడ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తణుకు ట్రాఫిక్ ఎస్సై ఎన్.హనుమంతరావు పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హనుమంతరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలు నివారించగలుగుతామని అన్నారు. అనంతరం తణుకు పట్టణంలో హెల్మెట్ ధరించిన వాహనదారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

27న మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఈ నెల 27వ తేది ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.వెంకటేష్ తెలిపారు. ఎంపీపీ పొనుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

రైతు పక్ష పార్టీ బీజేపీ


కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశి భూషణ్ రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతీయ జనతా పార్టీ రైతుల పక్ష పార్టీ అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశి భూషణ్ రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి గట్టిం మాణిక్యాలరావు కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శశి భూషణ్ రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అయినపర్తి శ్రీదేవి, రూరల్ మండల నాయకులు బండి ధనలక్ష్మి, బండి శ్రీనివాస్, న్యాయవాది కొండేపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇచ్చే తల్లిదండ్రులు శిక్షార్హులు


తణుకులో విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సత్యనారాయణ

తణుకు: మైనర్లు ముఖ్యంగా విద్యార్థులకు బైక్‌లు ఇచ్చే తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారని తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ హెచ్చరించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో బైక్‌లకు సైలెన్సర్లు మార్పులు చేసి పెద్ద పెద్ద శబ్దాలతో వెళుతున్న పలువురు విద్యార్థులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులను పిలిచి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవలి కాలంలో పెద్ద పెద్ద శబ్దాలతో బైక్‌లు నడుపుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్న సంఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఇలా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని సీఐ సత్యనారాయణ హెచ్చరించారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ షో, మిమిక్రీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ వార్షిక జాతర మహోత్సవాలు సందర్భంగా ఆలయం వద్ద శనివారం రాత్రి నవ్య ఈవెంట్స్, భారత్ రికార్డు, నంది అవార్డు గ్రహీత ఆర్గనైజర్ రాముచే మ్యాజిక్ షో, మిమిక్రీ, మాట్లాడే బొమ్మతో ప్రేక్షకులను అలరించారు.

హామీ ఇవ్వక పోయినా అమలు చేస్తున్నాం

- పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి
- 8వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం


తణుకులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని వాటిని కూడా అమలు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 8వ వార్డులో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సొంతిళ్లు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అర్హత గల పేదలందరికీ సొంత ఇంటి కలను నేరవేర్చాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఇంకా అర్హత ఉన్నవారిని గుర్తించి స్థల పట్టాలు, గృహ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. సుభిక్షపాలన అందిస్తున్న ఆంధ్రప్రదేశ్‌వైపు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు తొంగిచూస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజలంతా సొంతింటి కల నిజం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పడుతున్నారని, ఏ గడపలోకి వెళ్లినా ప్రభుత్వ పనితీరును కొనియాడుతుండడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా వలంటీరు వ్యవస్థ ద్వారా పింఛను తీసుకుంటున్న అవ్వ, తాతలు మళ్లీ మాకు జగనే రావాలని ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ బ్రోచర్‌లను మంత్రి కారుమూరి వారికి స్వయంగా అందచేశారు. ప్రజానీకం స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ (పీబీఆర్), కుడుపూడి చంద్రరావు, దోలా సింహాద్రినాయుడు, సామంతుల అప్పారావు, గంజి సతీష్, షేక్ బాజీ, శ్రీనివాసు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సత్వరమే మౌలిక వసతులు కల్పించాలి


అత్తిలి మండలం కొమ్మరలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ ప్రత్యేక అధికారి, ఎంపీపీ

అత్తిలి: జగనన్న హౌసింగ్ లే అవుట్‌ల్లో నిర్మించిన గృహాలకు మౌలిక వసతుల కల్పన సత్వరమే పూర్తి చేయాలని హౌసింగ్ ప్రత్యేక అధికారి కె మురళీకృష్ణ చెప్పారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ లేఅవుట్‌ల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, మౌలిక వసతులపై పర్యవేక్షించి వారికి అవసరమైన సేవలు అందిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టినవారు త్వరితగతిన గృహనిర్మాణ పనులు వేగవంతం చేసి, సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, హౌసింగ్ ఏఈ కె సత్యనారాయణమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి


జగనన్న కాలనీలో లబ్ధిదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు, నాయకులు

తణుకు టౌన్: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ కోరారు. శనివారం మండపాక గ్రామంలో వేల్పూరు లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లే అవుట్‌లో నిర్వహించిన అవగాహనా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పీ శ్రీ నివాసరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జగనన్న లే అవుట్‌ల్లో ఇంకా ఇళ్ల నిర్మాణం చేపట్టని వారు ప్రత్యేక ఏజెన్సీ ద్వారా నిర్మించుకోవచ్చని చెప్పారు. ఇందు కోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతాలను తెరవాలని కోరారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి వలంటీర్లు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులు అడిగిన పలు సందేహాలకు అధికారులు, నాయకులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో టీఎస్ మూర్తి, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి యుగంధర్ శ్రీనివాస్, ఇంజనీరింగ్, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, డ్వాక్రా వీఓఏలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్ వినియోగంపై అవగాహన అవసరం

తణుకు టౌన్: సైబర్ నేరాల నుంచి తప్పించుకోవడానికి స్మార్ట్ ఫోన్ వినియోగంపై అవగాహన అవసరమని తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ చెప్పారు. శనివారం తణుకు బ్యాంక్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో హెల్పేజ్ ఇండియా ఆధ్వర్యంలో స్మార్ట్ ఫోన్స్ వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్మార్ట్ ఫోన్ వినియోగానికి సంబంధించిన వివిధ అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఆర్జి భాస్కరరావు, చలపతిరావు, భారతీ రాధాకృష్ణ, పుష్పాంజలి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి


సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం ఎస్సై ఎం రాజేష్, సిబ్బంది


గాయపడిన సుబ్బాయమ్మ

తాడేపల్లిగూడెం అర్బన్: గుర్తు తెలియని వ్యక్తులు ఒక వృద్ధురాలిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పట్టణంలో చోటు చేసుకొంది. పట్టణానికి చెందిన సొలస సుబ్బాలక్ష్మి స్థానిక లూథరన్ చర్చి సమీపంలో కిరణా కొట్టు నిర్వహిస్తున్నారు. కిరణా కొట్టు సమీపంలోనే వీరు నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం సుబ్బలక్ష్మి ఇంటి వద్ద పూజ చేసుకొంటున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించి ఇనుప గూటం వంటి రాడ్డుతో ఆమె తలపై బలంగా పలుమార్లు మోదాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె కిందపడిపోయిన కొదిసేపటికి లేచి బైటకు వచ్చి ఆమె కిరణా కొట్టులో భర్త సొలస బసవరాజు వద్దకు చేరుకుంది. తల నుంచి తీవ్రంగా రక్త కారుతున్న భార్యను చూసిన బసవరాజుకు నోటమాటరాలేదు. హుటాహుటీన తేరుకుని సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటలపై భీమవరం నుంచి క్లూస్‌టీం ఎస్సై ఎం రాజేష్, ఐడి పార్టీ హెచ్‌సీ గుమ్మడి శ్రీను , సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించారు. ఎస్సై రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం


వృద్ధులకు బియ్యం బస్తాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ వట్టిప్రోలు రాము అన్నారు. పట్టణంలోని పేరిచర్ల ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం జోన్ చైర్మన్ గుడ్ విల్ విజిట్ కార్యక్రమం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు కోనా హనుమాన్ అధ్యక్షత వహించారు. రాము మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 666 కార్యక్రమాలు చేసిన డైమండ్స్ క్లబ్ మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా క్లబ్ మొదటి గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు సహకారంతో అంతర్జాతీయ పిన్‌ను డైమండ్స్‌కు అందజేశారు. వట్టిప్రోలు రామును క్లబ్ తరుపున సత్కరించారు. అదేవిధంగా క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా పేద వృద్ధులకు బియ్యం బస్తాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుద్దాల విజయ్‌బాబు, బోళ్ళ రాము, హేమసుందర్, ఆనంద్, పట్నాల రామకృష్ణ, ఎం.కుమార్, ఆంజనేయస్వామి, లియో క్లబ్ సభ్యులు చంద్రపవన్ కుమార్, పసుపులేటి పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది మునిస్వామి

తణుకు: రసీదు అడిగి తీసుకోవడం వినియోగదారుడి హక్కు అని తణుకు పట్టణానికి చెందిన న్యాయవాది కామన మునిస్వామి అన్నారు. శనివారం తణుకు పట్టణంలోని 2, 25 వార్డుల పరిధిలోని ఆయా సచివాలయాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మునిస్వామి మాట్లాడుతూ రసీదు అనేది తాను కొనుగోలు చేసిన వస్తువుకు రక్షణ లాంటిదని అన్నారు. వ్యాపారస్తుడు సరైన సమాధానం చెప్పకపోతే వినియోగదారుల కోర్టు ద్వారా తనకు నష్టపరిహారాన్ని వినియోగదారుడు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు మండల న్యాయసేవా సంస్థ సభ్యులు కొరు వెంకటేశ్వర్లు, సచివాలయం కార్యదర్శి ఎం.సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్దను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి


అత్తిలి మండలం ఆరవల్లిలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మక్కా సూర్యనారాయణ

అత్తిలి: విద్యార్థులకు సంపూర్ణ పోషకాహారంగా అందిస్తున్న జగనన్న గోరుముద్దను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ కోరారు. అత్తిలి మండలం ఆరవల్లి జడ్పీ ఉన్నత, మండల పరిషత్ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించి, మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని భుజించారు. మెనూ ప్రకారం అన్నం, ఆకుకూరలు, గుడ్డు, చిక్కీ అందించారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నైపుణ్యం మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, ఉప సర్పంచ్ వెలగల అమ్మిరెడ్డి, పాల్గొన్నారు.

రవాణాశాఖ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి


హెల్మెట్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై, పోలీస్ సిబ్బంది

అత్తిలి: రహదారుల భద్రతపై కనీస అవగాహన అవసరమని, వాహనాలు నడిపే వ్యక్తులు రవాణాశాఖా జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అత్తిలి ఎస్సై కేసీహెచ్ స్వామి చెప్పారు. 34వ జాతీయ భద్రతా వారోత్సవాలు సందర్భంగా శనివారం ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు హెల్మెట్ ధరించి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై స్వామి మాట్లాడుతూ ప్రతి రోజు వివిధ పనులకోసం బైక్‌పై తిరిగే సమయాల్లో హెల్మెట్ ధరించకపోవడం, అతివేగంగా ప్రయాణించడం జరుగుతోందని, కొద్దిపాటి నిర్లక్ష్యం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సురక్షితమైన ప్రయాణం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకుని వచే ఉద్దేశ్యంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ పెట్టుకోవడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. ఈసందర్భంగా బైక్ ర్యాలీ అత్తిలి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

రామ్మూర్తి ఆశయ సాధనకు కృషి చేయాలి


గానాల రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాము, తదితరులు

తణుకు అర్బన్: విశ్వబ్రాహ్మణులను బీసీలుగా ప్రభుత్వంచే గుర్తింపచేసిన మహనీయుడు గానాల రామ్మూర్తి, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పాడుగు రామాచారి (రాము) అన్నారు. విశ్వబ్రాహ్మణుల ఆరాధ్యదైవం గానాల రామ్మూర్తి 131వ జయంతి సందర్భంగా తణుకు స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాము మాట్లాడుతూ రామ్మూర్తి స్ఫూర్తిగా స్వర్ణకారులు కలిసికట్టుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ చైర్మన్ కొమ్మోజు రామకృష్ణ, మాజీ చైర్మన్ అనుపోజు జగన్నాథం, స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు టేకి రాజు, సహాయ కార్యదర్శి అనుపోజు నాగు, పాడుగు సత్యనారాయణ, పొన్నాడ పూర్ణచంద్రరావు, ఆవుపాటి వీరబాబు, జవ్వాది ఈశ్వర్‌ప్రసాద్, ధవళేశ్వరపు సత్యనారాయణ పాల్గొన్నారు.